సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 26.4 /21.6

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.



కోయిల్‌సాగర్.. 13 గేట్ల ఎత్తివేత

కోయిల్‌సాగర్ ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు పోటెత్తింది. దీంతో శనివారం సాయంత్రం 27 అడుగులు ఉన్న నీటిమట్టం.. ఆదివారం ఉదయం 7 గంటల వరకు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు చేరడంతో 13 గేట్లు తెరిచి 35 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. - దేవరకద్ర

సరళాసాగర్.. తెరుచుకున్న సైఫన్లు



ఆసియా ఖండంలోనే రెండోదిగా ప్రసిద్ధిగాంచిన సరళాసాగర్ జలాశయానికి ఆదివారం వరద పోటెత్తడంతో ఆటోమేటిక్‌గా 10 సైఫన్లు తెరుచుకున్నాయి. ఒక్కొక్క వుడ్ సైఫన్ ద్వారా 2,300, ప్రైమరీ సైఫన్ ద్వారా 500 క్యూసెక్కులు కలిపి మొత్తం 20 వేల క్యూసెక్కుల నీరు దిగువకు పారుతోంది. రెండేళ్ల తర్వాత సైఫన్లు తెరుచుకున్నాయి. - మదనాపురం



సంగంబండ.. వరద ఉధృతి

మక్తల్ మండల శివారు కర్ణాటక రాష్ట్రంలోని ఇడ్లూర్ వాగు నుంచి వరద వస్తుండటంతో సంగంబండ రిజర్వాయర్ నిండుకుండను తలపిస్తోంది. దీంతో అధికారులు 4 గేట్లు తెరిచి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇరిగేషన్ ఈఈ శివప్రసాద్, డీఈఈ సురేష్ ఎప్పటికప్పుడు వరద ఉధృతిని పర్యవేక్షిస్తున్నారు. - మక్తల్

రామన్‌పాడు.. లక్ష క్యూసెక్కులు



రామన్‌పాడు జలాశయానికి లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో 11 గేట్లు తెరిచి అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రధానంగా కోయిల్‌సాగర్ గేట్లు ఎత్తడం, ఊకచెట్టు వాగు, స్థానికంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. - మదనాపురం

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఉండి వర్షం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలు చేపడుతున్నందున ప్రజావాణిని రద్దు చేస్తున్నామన్నారు. ఈ విషయం గమనించి ప్రజలు ఎవరూ ఫిర్యాదులు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని విజ్ఞప్తి చేశారు.

విద్యా సంస్థలకు సెలవు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర తెలిపారు. సోమవారం సైతం భారీ, అతి భారీ వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు చర్యలో భాగంగా సెలవు ప్రకటించినట్లు చెప్పారు. జిల్లాలోని యాజమాన్యాలు ఎవరూ సోమవారం విద్యాసంస్థలు తెరవవద్దని, ఎవరైనా విద్యాసంస్థలను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

పరీక్షలు వాయిదా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో సోమవారం నిర్వహించే అన్ని పరీక్షలను వర్షం కారణంగా వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని, వాయిదా వేసిన పరీక్షల తేదీలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకం

- ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకం అని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిర్వహించిన సభలో అసదుద్దీన్ ఓవైసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ బిల్లు ప్రజాస్వామ్యానికి స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ముస్లింల హక్కులను హరించే విధంగా ఈ బిల్లు ఉందని ఆరోపించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సభలు నిర్వహించి.. ముస్లింలలో చైతన్యం తీసుకొస్తామన్నారు. పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ట్రిపుల్ తలాక్ చట్టాన్ని తీసుకొచ్చారని, దాని వల్ల ముస్లిం మహిళలకు ఒరిగిందేమిలేదని విమర్శించారు. అలాగే ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ధార్మికవేత్త మౌలానా జియావుద్దీన్ నక్షబందీ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. అంతకుముందు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును ఇండియా కూటమిలోని 230 మంది ఎంపీలు వ్యతిరేకించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమిది ఒకటే నిర్ణయమని, ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎంఐఎం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు షౌకత్‌అలీ, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మతపెద్ద రజాక్‌షాఖాద్రీ, మిల్లీ మహజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



హన్వాడ మండలం నాయినోనిపల్లి శివారులో చెరువు కట్ట తెగి వృథాగా పారుతున్న వర్షపు నీరు



మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్‌లో అలుగు పారుతున్న పెద్దచెరువు

కుండపోత..

జిల్లాలో వర్ష బీభత్సం

- అలుగులు పారిన చెరువులు, కుంటలు
- కొట్టుకుపోయిన రహదారులు.. స్తంభించిన రాకపోకలు
- నీట మునిగిన పొలాలు.. ఆరుతడి పంటలకు నష్టం
- అత్యధికంగా మహమ్మదాబాద్ మండలంలో 12.14 సెంటీమీటర్ల వర్షపాతం
- మహబూబ్‌నగర్, జడ్చర్ల పట్టణాల్లో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లా అంతటా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురుస్తుండటంతో వాగులు, వంకలు ఏకమై ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల్లోకి వరద నీరు భారీగా చేరుకోవడంతో అలుగులు పారుతున్నాయి. జిల్లాలో సగటున 96.1 మి.మీ., వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా రోడ్లపై నుంచి వరద నీరు ఉధృతంగా పారడంతో పలుచోట్ల రోడ్లు ధ్వంసమై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంది. ఈ క్రమంలో జడ్చర్ల వద్ద జాతీయ రహదారి– 44పై వరద నీరు నిల్వడంతో వాహనాలను దారి మళ్లించారు. హన్వాడ మండల పరిధిలో జాతీయ రహదారి–167 కోతకు గురైంది. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు ఎవరూ కూడా ఇళ్ల నుంచి బయటకు రావొద్దని అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. వర్షం కారణంగా మట్టి మిద్దెలు, పెంకుటిళ్లు పేక మేడల్లా కూలిపోతున్నాయి. దీంతో ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. వర్షం బీభత్సంగా కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. వాగులు ప్రమాదకరంగా ప్రవహించడంతో అప్రమత్తమైన కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి పరిశీలించారు.

రాకపోకలకు అంతరాయం

జిల్లాలోని దుందుభీతోపాటు, ఇతర ప్రధాన వాగులు, వంకలు ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తున్నాయి. మహబూబ్‌నగర్ నుంచి తాండూరు వైపు వెళ్లే ప్రధాన రహదారి హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోయింది. వేపూర్– కొత్లాబాద్ బ్రిడ్జిపై వరద పారుతుండటంతో చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంబాద్, పుల్పోనిపల్లి గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. నవాబ్‌పేట– మహబూబ్‌నగర్ మధ్య గల తాళ్ల వాగుపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో రోడ్డుపై రాకపోకలకు అంతరాయం నెలకొంది.

8 మండలాల్లో 10 సెంటీమీటర్ల వర్షపాతం

జిల్లాలో ఎనిమిది మండలాల్లో పది సెంటీమీటర్లకు పైగా సగటు వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు అత్యధికంగా మహమ్మదాబాద్ మండలంలో అత్యధికంగా 12.14 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా.. తక్కువగా హన్వాడ మండలంలో 6.39 సెం.మీ. వర్షం కురిసింది. కాగా.. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హన్వాడలో 3.7సెం.మీ., కౌకుంట్లలో 3.45, అడ్డాకులలో 3.4, దేవరకద్రలో 3.33 మహబూబ్‌నగర్ అర్బన్‌లో 3.3సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు కురిసిన సగటు వర్షపాతం (సెంటీమీటర్లలో)

మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
మహమ్మదాబాద్	12.14	మ.నగర్ అర్బన్	12.11
భూత్పూర్	11.38	జడ్చర్లలో	10.94
గండేడ్‌లో	10.84	నవాబ్‌పేట	10.52
బాలానగర్	10.28	దేవరకద్ర	10.06
రాజాపూర్	9.01	మిడ్జిల్‌లో	9.41
కౌకుంట్ల	9.09	మూసాపేట	8.95
చిన్నచింతకుంట	8.94	మ.నగర్ రూరల్	8.26
కోయిలకొండ	7.6	అడ్డాకుల	7.45
హన్వాడ	6.39		





జడ్చర్ల మండలం యాసాయికుంట తెగడంతో నీట మునిగిన వరిపంట, వరద నీటిలో మిడ్జిల్ కేజీబీవీ భవనం

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

జిల్లాలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించడంతోపాటు జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. దీంతో ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలతో జిల్లాలో ప్రజలు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణ సహాయం కోసం కంట్రోల్ రూం 08542– 241165 నంబర్‌కు సమాచారం అందించాలని, ఈ కంట్రోల్ రూం 24 గంటల పాటు పనిచేస్తుందని పేర్కొన్నారు. కంట్రోల్ రూం ద్వారా సమాచార సేకరణ కోసం బృందాలను ఏర్పాటు చేశామన్నారు.





అడ్డాకుల మండలం గౌరీదేవిపల్లి వద్ద కాజ్‌వేపై ఉధృతంగా పారుతున్న వరద నీరు



హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ శివారులో జాతీయ రహదారిపైకి వచ్చిన వరద నీరు

అత్యవసరమైతేనే బయటకురండి

మహబూబ్‌నగర్ క్రైం/ జడ్చర్ల/ దేవరకద్ర: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్పీ జానకి అన్నారు. ఆదివారం ఆమె జిల్లాకేంద్రంలోని పెద్ద చెరువు, ఎర్రకుంట, జడ్చర్ల, నసుర్లాబాద్, దేవరకద్ర, కోయిల్‌సాగర్, బండ్రవల్లి వాగులను పరిశీలించి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. పలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజలకు సమస్యలు తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం పని చేయాలని, నిత్యం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలను వరద నీటి ఉధృతిని అంచనా వేయకుండా నదులు, వాగులు, కాల్వలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. విద్యుత్ స్తంభాల సమీపంలోకి వెళ్లవద్దన్నారు. ప్రాంతాలను పరిశీలించిన వారిలో డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సీఐలు అప్పయ్య, ఆదిరెడ్డి, రామకృష్ణ తదితరులున్నారు.



జడ్చర్ల మండలం తంగెళ్లపల్లి రహదారిపై వరదను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

అథ్లెట్లు జాతీయస్థాయికి ఎదగాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా అథ్లెట్లు జాతీయస్థాయికి ఎదగాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజేంద్రకుమార్ అన్నారు. మెదక్‌లో గత 17, 18 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పురుషుల 1500 మీటర్ల విభాగంలో నవీన్ బంగారు పతకం, 10000 మీటర్ల పరుగులో దీపక్, లాంగ్‌జంప్‌లో, 23 ఏళ్లలోపు మహిళల 5000 మీటర్ల పరుగులో పూజ కాంస్య పతకాలు సాధించారు. ఆదివారం మెయిన్ స్టేడియంలో రాజేంద్రకుమార్ బంగారు పతకం సాధించిన క్రీడాకారుడికి రూ.1,500, కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులకు చెరో రూ.వెయ్యి చొప్పున నగదు పారితోషికాలు అందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర, కోచ్‌లు ఆనంద్‌కుమార్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అతలాకుతలం



జిల్లాకేంద్రంలోని లక్ష్మీనగర్‌కాలనీలో రహదారిని ముంచెత్తిన వరద నీరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో మూడురోజులుగా ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇంట్లోని వారు బయటకు రావడానికి నానాపాట్లు పడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి ఆరంభమైన వర్షం ఆదివారం మధ్యాహ్నం వరకు ఆగకుండా కురవడంతో పట్టణం మొత్తం అతలాకుతలమైంది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. ఆయా వార్డుల రోడ్లన్నీ జలమయం కాగా సమీపంలోని కాల్వలు పొంగిపొర్లాయి. ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వెనుక భాగంలోని దొంగలకుంట నిండిపోయి సమీపంలోని క్రిస్టియన్‌పల్లి, శ్రీరాంనగర్ కాలనీ, వెంకటరమణకాలనీ, అయోధ్యనగర్ తదితర కాలనీలను ముంచెత్తింది. అలాగే పాలకొండ చెరువు అలుగు పారి వరద నీరు బైపాస్‌కు అటు, ఇటు వైపు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇక జగ్జీవన్‌రాంనగర్, పీర్లబావి ప్రాంతం, పాత పాలమూరు, గణేష్‌నగర్, వల్లభ్‌నగర్, కుర్హినిశెట్టికాలనీ, లక్ష్మీనగర్, దొడ్డలోనిపల్లి, సద్దలగుండు, రాజేంద్రనగర్‌లోని వీధులన్నీ జలమయమయ్యాయి. కొన్ని ఇళ్లలోకి వరద చేరడంతో కంటిమీద కునుకు లేకుండా గడిపారు. కొత్త బస్టాండు, డిపో ఆవరణతోపాటు ఎదురుగా ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలోకి వరద చేరింది. అనంతరం మున్సిపల్ సిబ్బంది యంత్రాల సాయంతో తోడిపోయగా యథాస్థితికి వచ్చింది. కాగా, ఆయా లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాంనగర్‌లోని ఇంటింటికీ వెళ్లి సుమారు 25 కుటుంబాలకు ఆదివారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందజేశారు. ఇక పెద్దచెరువు కట్ట నుంచి బీకేరెడ్డికాలనీ వైపు వెళ్లేచోట పెద్ద గుంత పడగా మున్సిపల్ చైర్మన్ దగ్గరుండి పూడ్చివేయించారు. నిత్యావసర వస్తువులు కొనడానికి, వివిధ పనుల మీద బయటకు వచ్చిన పట్టణ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నీట మునిగిన వినాయకుడి విగ్రహాలు



రేణుకా ఎల్లమ్మ ఆలయంలోకి చేరిన వరద నీరు



లక్ష్మీనగర్‌కాలనీలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

సమన్వయంతో పనిచేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రానున్న రెండురోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల మేరకు అన్ని జిల్లాల యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాలపై ఆదివారం ఆయన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులతో నిర్వహించిన వీసీలో మాట్లాడారు. ఇదేవిధంగా రానున్న రెండు రోజులు పని చేయాలని కోరారు. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


కృష్ణయ్య(ఫైల్)

చారకొండ: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రానికి చెందిన కొండపల్లి కృష్ణయ్య (33) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం..కృష్ణయ్య కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. కాగా ఆయన భార్య కళావతి తల్లిగారి ఇంటికి శుక్రవారం బోనాల పండుగకు వెళ్లగా.. ఎవరూ లేని సమయంలో వారు నివసిస్తున్న గుడిసెలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. దీంతో సమీపాన ఉన్న బంధువులు, అన్న శ్రీను గమనించి వెంటనే కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. కళావతికి ఫోన్‌లో విషయం తెలిపారు. అయితే పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఉస్మానియాకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున కృష్ణయ్య మృతి చెందాడు. అతడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారని పోలీసులు తెలిపారు. కళావతి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పంట పొలంలో వ్యక్తి దారుణ హత్య


గద్వాల సంజన్న (ఫైల్)

ఎర్రవల్లి: పంట పొలంలో వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ స్వాతి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రవల్లి మండల పరిధిలోని సాసనూలుకు చెందిన గద్వాల సంజన్న(48) గ్రామ సమీపంలోని ఓ పామాయిల్ తోటను కౌలుకు తీసుకొని అందులో అంతర పంటగా వేరుశనగను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11గంటల సమయంలో ఇంటి నుంచి పొలానికి వెళ్లగా.. గుర్తుతెలియని దుండగులు మారణాయుధాలతో తీవ్రంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాయంత్రం అటుగా వెళ్లిన స్థానికులు దీనిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవితో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారని.. భార్య ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు, జిల్లా డాగ్‌స్క్వాడ్ బృందం సందర్శించి హత్యకు గల కారణాలను, పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు.

చికిత్స పొందుతూ హాస్టల్ వర్కర్ మృతి


శ్రీను(ఫైల్)

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన గౌడుగు శ్రీను(40) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గౌడుగు శ్రీను వెల్దండ మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల కిందట అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. మృతుడికి భార్య శ్రీశైలమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భర్త మృతి తట్టుకోలేక భార్య ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: భర్త మృతిచెందాడని తీవ్ర మనస్తాపం చెంది భార్య పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుని, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. అందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ పట్టణంలోని బండ్లగేరికి చెందిన సరోజ(35) శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. సరోజ భర్త ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో మనస్తాపం చెంది ఆమె పురుగు మందు తాగింది.

45 మందికి జైలుశిక్ష

గద్వాల క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 45 మంది ద్విచక్ర వాహనదారులకు రెండు రోజుల పాటు జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ అలంపూర్ కోర్టు న్యాయమూర్తి కవిత తీర్పును వెల్లడించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు వాహనాదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని.. గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని ఆయన సూచించారు.

ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ


జూరాల ప్రాజెక్టు క్రస్టు గేట్ల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదలవుతున్న వరద

- జూరాల ప్రాజెక్టుకు 3,82,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 45 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 3,88,683 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం రాత్రి 7 గంటల వరకు 3,82,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 45 క్రస్టు గేట్లను ఎత్తి 3,69,954 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 17,964 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 45, ఎడమ కాల్వకు 430, కుడి కాల్వకు 290, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,88,683 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 1,72,739 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1,76,651 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,30,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1,02,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నిలకడగా విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిలకడగా కొనసాగుతోంది. 5 యూనిట్లలో విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 127.449 ఎంయూ, దిగువలో ఇప్పటి వరకు 99.710 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. మొత్తం 227.159 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

రామన్‌పాడులో..

కోయిల్ సాగర్ నుంచి ఊకచెట్టు వాగు ద్వారా రామన్‌పాడు జలాశయానికి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో 7 గేట్లు ఎత్తి 40 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జలాశయాన్ని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సందర్శించి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

సుంకేసులకు 5 వేల క్యూసెక్కులు..

రాజోళి: సుంకేసుల డ్యాంకు 5,944 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు జేఈ రాజు తెలిపారు. ఒక గేటును తెరిచి 4,479 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 1,465 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వెల్లడించారు.

కోయిల్‌సాగర్‌లో..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో మొదట మూడు గేట్లను తెరిచి నీటి విడుదల కొనసాగించారు. మరో రెండు గంటల తర్వాత 11 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని వాగులోకి వదిలారు. ఇలా గంట గంటకు ప్రాజెక్టుకు వస్తున్న వరదను కట్టడి చేయడానికి అధికారులు నిరంతర పర్యవేక్షణ చేశారు. ఒక దశలో ప్రాజెక్టుకు ఉన్న 13 గేట్ల ద్వారా 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఊకచెట్టు వాగు ఉప్పొంగింది. సాయంత్రం వరద ఉధృతి కొంత తగ్గడంతో 7 గేట్ల ద్వారా 21 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. కోయిల్‌సాగర్ గేట్లు ఎత్తడంతో సందర్శకులు తరలివచ్చారు.

రెండేళ్ల తర్వాత..

మదనాపురం: సరళాసాగర్ జలాశయానికి వరద పోటెత్తడంతో ప్రాజెక్టు సైఫన్లు ఆటోమెటిక్‌గా తెరుచుకున్నాయి. 8 ఉడ్ సైఫన్లు, 2 ప్రైమరీ సైఫన్ల ద్వారా 20 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోంది. సైఫన్లు తెరుచుకున్న విషయం తెలుసుకున్న పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. కాగా, శంకర సముద్రం నుంచి నీటిని విడుదల చయడంతో దంతనూరు – శంకరమ్మపేట మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మదనాపురం వద్ద కాజ్‌వే మునిగిపోవడంతో వనపర్తి జిల్లా కేంద్రంతో పాటు కొత్తకోట, మదనాపురం, ఆత్మకూర్, అమరచింత మండలాలకు రవాణా వ్యవస్థ స్తంభించింది.


సరళాసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీశైలం ఘాట్‌రోడ్డులో విరిగిపడిన కొండచరియలు


శ్రీశైలం ఘాట్‌రోడ్డులో విరిగిపడిన కొండ చరియలు.. నిలిచిన వాహనాలు

- స్పందించిన పోలీస్‌శాఖ... తొలగింపునకు సత్వర చర్యలు

దోమలపెంట/జడ్చర్ల: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఆదివారం కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న జిల్లా పోలీసు ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపదికన స్టేట్ హైవే అథారిటీ వారిని పిలిపించి రోడ్డుపై అడ్డంగా పడిన కొండచరియలను పొక్లెయిన్ సాయంతో తొలగించారు. ఈగలపెంట ఎస్‌ఐ వీరమల్లు ఘటనా స్థలంలోనే ఉండి పరిస్థితిని సమీక్షించారు. కాసేపటి తర్వాత వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.

వాహనాలు నిలిపివేత..

మన్ననూర్/వెల్దండ: హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై వెల్దండ మండలం కొట్ర గేట్ వద్ద ఆదివారం శ్రీశైలం వెళ్లే వాహనాలను ఎస్‌ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది బాలశంకర్‌రెడ్డి, కృష్ణ నిలిపివేశారు. వర్షాలకు శ్రీశైలం ఘాట్‌రోడ్‌లో కొండచరియలు విరిగి రోడ్లపై పడుతున్నందున ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాలను నిలిపివేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలని ఎస్‌ఐ సూచించారు. శిథిల ఇళ్లలో ఉండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

❒ దోమలపెంట సమీపంలో కొండ చరియలు విరిగి పడుతున్నందున శ్రీశైలం క్షేత్రానికి భక్తులు రావద్దని అమ్రాబాద్ ఎస్‌ఐ రమేష్ కోరారు. ముందస్తు జాగ్రత్తగా మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టును మూసివేసినట్లు తెలిపారు. వర్షాలు నిలిచే వరకు ఎవరు కూడా ఈ మార్గంలో రాకపోకలు కొనసాగించవద్దని తెలిపారు.


వెల్దండ మండలం కొట్ర గేట్ వద్ద వాహనాలను నిలిపివేస్తున్న ఎస్‌ఐ కురుమూర్తి

బాదేపల్లిలో..

బాదేపల్లిలోని రంగనాయకస్వామి పెద్దగుట్టపై కొండచరియలు విరిగి గుట్టపైకి వెళ్లే రహదారిపై పడ్డాయి. ఏ మాత్రం దొర్లుకుంటూ దిగువకు వచ్చినా ఆస్తి, ప్రాణ నష్టం జరిగి ఉండేది.


బాదేపల్లి పెద్దగుట్టపై విరిగపడ్డ కొండచరియలు

చెరువును తలపిస్తున్న ప్రధాన స్టేడియం


నీటమునిగిన మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం నీటితో నిండిపోయింది. చిన్నపాటి చెరువులా కనిపిస్తోంది. నీరు బయటకు వెళ్లడానికి ఎటువంటి సౌకర్యం లేకపోవడంతో సమస్యగా మారుతోంది. ఖోఖో, హ్యాండ్‌బాల్ కోర్టులు, ఫుట్‌బాల్ కోర్టు, వాకర్ ట్రాక్ నీటితో నిండిపోతున్నాయి. బాస్కెట్‌బాల్ కోర్టు చుట్టూ నీళ్లు నిలిచాయి.

వర్షం వస్తే స్టేడియం బంద్

మెయిన్ స్టేడియానికి నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది సంఖ్యలో వాకర్లు, క్రీడాకారులు వస్తుంటారు. అయితే వర్షకాలంలో వాకింగ్, క్రీడల ప్రాక్టీస్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భారీ వర్షం వచ్చి స్టేడియంలో నీళ్లు నిలిస్తే ఆయా రోజుల్లో బంద్ పెడుతున్నారు. నీళ్లన్ని ఇంకిపోయి స్టేడియం యధాస్థితికి చేరితే అప్పుడు వాకర్లను అనుమతిస్తున్నారు.


హ్యాండ్‌బాల్ కోర్టులో..

పరిశీలించిన డీవైఎస్‌ఓ

మెయిన్ స్టేడియంలో నిలిచిన వర్షపు నీటిని ఆదివారం ఉదయం జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ పరిశీలించారు. నీళ్లను తీసివేయాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ మాట్లాడుతూ పెద్ద చెరువు కాల్వ నిండి స్టేడియంలోకి వర్షపు నీళ్లు వస్తున్నాయని, ఈ విషయమై మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నిద్రలోనే.. అనంతలోకాలకు

- గోడ కూలి తల్లీకూతురు దుర్మరణం
- కొత్తపల్లి మండలం ఎక్కమేడ్‌లో విషాదం

మద్దూరు: తల్లీకూతురు ఇద్దరు రాత్రి భోజనం చేసి నిద్రలోకి జారుకున్నారు. అయితే మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి గోడ కూలీ ఇద్దరిపై పడడంతో నిద్రలోనే అనంతలోకాలకు వెళ్లిపోయారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని ఎక్కమేడ్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన హన్మమ్మ(60), తన చిన్న కూతురు అంజిలమ్మ(30) (భర్త చనిపోవడంతో) ఇద్దరూ కలిసి నివాసం ఉంటున్నారు. అయితే ఇంటి నిర్మాణం ఇటుకలతో చేసి బయట ప్లాస్టరింగ్ చేయకపోవడంతో వర్షానికి బాగా తడిసిపోయింది. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున గాఢ నిద్రలో ఉండగా


హన్మమ్మ (ఫైల్)


అంజిలమ్మ (ఫైల్)

గోడ కూలీ పడటంతో అక్కడే నిద్రిస్తున్న తల్లీకూతుళ్లు ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఉదయం ఇల్లు కూలిపోయిన విషయం తెలుసుకున్న హన్మమ్మ కొడుకు అంజిలప్ప పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇదే గ్రామంలో అంజిలప్ప భార్య పిల్లలతో వేరే ఇంట్లో ఉంటున్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ అనిల్‌కుమార్, కోస్గి సీఐ దస్రునాయక్, ఎస్‌ఐ రాంలాల్‌కు ఘటనా స్థలానికి చేరుకొని శవానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై హన్మమ్మ కొడుకు అంజిలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీఓ మధుమోహన్ సైతం గ్రామానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. మండలంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తహసీల్దార్‌కు సూచించారు.


పగిడ్యాల్‌లో కూలిన ఇల్లు


ఖానాపూర్‌లో కూలిపోయిన ఇల్లు

కూలిన ఇళ్లు.. బాధితులకు పునరావాసం


రాంసింగ్‌తండాలో కూలిన ఇల్లు

సాక్షినెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా పలు చోట్ల వర్షాలకు ఇల్లు కూలిపోయాయి. దీంతో పలుచోట్ల బాధితులకు పునరావాసం కల్పించారు.

➡ మహబూబ్‌నగర్ రూరల్ పరిధిలోని గాజులపేటలో రెండు, రామచంద్రాపూర్, జమిస్తాపూర్, మాచన్‌పల్లి గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఇళ్లు కూలిపోయాయి.

➡ నవాబుపేట మండలంలో వానలకు ఇల్లు కూలి నిరాశ్రయులుగా మారిన వారికి పునరావాసం కల్పించినట్లు తహసీల్దార్ నాన్యనాయక్, ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. ఆదివారం రాంసింగ్ తండా, పోమాల్, చౌడూర్, సిద్దోటం గ్రామాల్లో పలు ఇళ్లు కూలినట్లు వివరించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో పునరావాసం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటికే మండలంలో పూర్తిగా, పాక్షికంగా ఇళ్లు కూలిన సంఖ్య 23కు చేరిందని వివరించారు.

➡ మిడ్జిల్‌లో అధిక వర్షాలకు దుద్దు నాగమ్మ ఇల్లు కూలిపోయింది.

➡ భూత్పూర్ పరిధిలోని కొత్తూర్ గ్రామంలో బుర్ర ఖాదర్ ఇల్లు కూలుతున్న విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ యాదయ్య ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో పునరావాసం కల్పించారు.

➡ భూత్పూర్ పరిధిలోని అమిస్తాపూర్ 6వ వార్డులో లక్ష్మమ్మ అనే మహిళకు చెందిన రేకుల ఇల్లు పాక్షికంగా కూలిపోయింది.

➡ జడ్చర్ల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఓ ఇల్లు కూలిపోయింది.

➡ పగిడ్యాల్ గ్రామంలో శంకరమొల్ల బుగ్గయ్య ఇల్లు కూలిపోయింది.

➡ చిన్నచింతకుంట మండల కేంద్రంలోని రెండోవార్డులో మొల్లగపూర్ మట్టి రాతి ఇళ్ల గోడ ఆదివారం ఉదయం కూలింది.

➡ జిల్లా కేంద్రంలోని వేపురిగేరిలో ఒకటి, పాతపాలమూరులో రెండు ఇళ్లు కూలిపోయాయి. అలాగే 28వ వార్డు పరిధిలోని ప్రభుత్వ యునాని ఆస్పత్రి కాంపౌండ్ నేలకూలింది. పాత జిల్లా గ్రంథాలయానికి ఎదురుగా కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న తపాలా శాఖ కార్యాలయ గోడలను తొలగించారు. తొమ్మిదో వార్డు పరిధిలోని భాగ్యనగర్‌కాలనీలో మట్టి రోడ్లన్నీ కోతకు గురయ్యాయి.


మిడ్జిల్‌లో కూలిన దుద్దు నాగమ్మ ఇల్లు


అమిస్తాపూర్‌లో పాక్షికంగా కూలిన రేకుల ఇల్లు


కొత్తూర్‌లో ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం పొందిన ఓ కుటుంబం


చిన్నచింతకుంటలో కూలిన మట్టి గోడ


పాతపాలమూరులో కూలిన పాత ఇల్లు


వేపురిగేరిలో కూలిన పాత ఇల్లు

గొర్రెల కాపరులను కాపాడిన అధికారులు


గొర్రెల కాపరులతో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

తాడూరు: మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ వాగులో సిర్సవాడకు చెందిన గొర్రెల కాపరులు చిన్న మల్లయ్య, ఆంజనేయులుతో పాటు 200 గొర్రెలు చిక్కుకున్నాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదివారం సిర్సవాడకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. డ్రోన్ సహాయంతో వాగులోని మోతుకులగడ్డ ప్రాంతంలో గొర్రెలతో పాటు కాపరులు క్షేమంగా ఉన్నట్లు గుర్తించి, మత్స్యకారుల సాయంతో నాటుపడవల ద్వారా సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కాపరుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


కాపరులను గుర్తించేందుకు డ్రోన్ సిద్ధం చేస్తున్న పోలీసులు